# అమెరికా దక్షిణాసియాను విభజించి పాలించే దుష్ట క్రీడ

**ఇటీవల,** అమెరికా దేశాధినేతలు పాకిస్తాన్ నేతలపై, ప్రత్యేకించి ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్లపట్ల వారి వైఖరిపై కొన్ని పరుషమైన వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్‌కు మేము వేలకోట్ల డాలర్లను చెల్లిస్తున్నాము. అదే సమయంలో, మేము ఎవరిపై యుద్ధం సలుపుతున్నామో ఆ టెర్రరిస్టులకే వారు ఆశ్రయం కల్పిస్తున్నారు" అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నాడు. "టెర్రరిస్టు సంస్థలకు పాకిస్థాన్ కల్పిస్తున్న రక్షణ స్థావరాలపట్ల మేమింక మౌనంగా వుండబోము" అని ఆయన పేర్కొన్నాడు. "పాకిస్తాన్ తన ప్రవర్తనను మార్చు కోవాలనే షరతుపైనే అమెరికానుండి పాకిస్థాన్‌కు సహాయం అందుతుంది" అని అమెరికా రక్షణశాఖా మంత్రి రెక్స్ టిల్లర్‌సన్ పేర్కొన్నాడు.

పాకిస్తాన్ నేతలుకూడా వారి తీరులో వారు ప్రతిస్పందించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా సాగించే యుద్ధానికి పాకిస్తాన్ అందించే తోడ్పాటులను ట్రంప్ గుర్తించకపోగా, అవమానకరంగా మాట్లాడుతున్నాడని పాకిస్తాన్ విదేశాంగశాఖామంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నాడు. "అమెరికా నుండి మేము ఎలాంటి ఆర్థిక, పాదార్థిక సహాయంకోసం ఎదురుచూడటం లేదు కానీ, మా తోడ్పాటుపట్ల విశ్వాసం, అవగాహన, గుర్తింపును కోరుతున్నామ"ని పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ క్వమర్ బజ్వా అన్నారు. "ఆఫ్ఘనిస్తాన్‌ను స్థిరపరచటానికి పాకిస్థాన్‌ను బలిపశువును చేయటమేమీ తోడ్పడబోద"ని పాకిస్థాన్ జాతీయ భద్రతాకమిటి పేర్కొంది. భారతదేశం తన పొరుగు దేశాలతో వైరుధ్యాలతో కూడిన సంబంధాలతో వుండటంతోపాటు, తూర్పు–పడమరల నుండి పాకిస్థాన్‌ను అస్థిరపరిచే విధానాన్ని అనుసరిస్తున్న కారణంగా దక్షిణాసియాలో భారతదేశం నికరంగా భద్రత కల్పించేదిగా వుండలేదని కూడా ఈ కమిటి నొక్కి చెప్పింది.

'డాలర్లను ఆశించి, ఇతరుల కోసం యుద్ధాల కెన్నడూ పాల్పడకూడదనే విలువైన పాఠాన్ని పాకిస్థాన్ పొందింద'ని పాకిస్థాన్ తెహ్రీక్–ఐ–ఇన్సాఫ్ నాయకుడు ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. "అమెరికా తరపున మేము ఆఫ్ఘనిస్తాన్‌తో రెండు యుద్ధాలలో పాల్గొని, రెండుసార్లూ పెద్దమొత్తంలో ప్రజానష్టాన్నీ, ఆర్థిక మూల్యాన్ని చెల్లించాం. అమెరికా సాగిస్తోన్న టెర్రరిజంపై యుద్ధంలో 70 వేలమంది పాకిస్థాన్ ప్రజల ప్రాణాలను మేము బలిపెట్టాం". "మా ఆర్థిక వ్యవస్థ 10వేల కోట్ల డాలర్ల నష్టాలను పొందింది. దీనికి తోడుగా, మా సమాజం అలవికాని భారాలను మోయవలసివచ్చింది. 'మరోసారి ఇలా జరగనీయవద్దు' అని చాటేందుకు పాకిస్థాన్‌కిది సరైన సమయమ"ని ఆయన పేర్కొన్నారు.

అమెరికా పాలకులు తమ వ్యాఖ్యానాలలో అహంకారి అయిన ఓ యజమానిలాగా వ్యవహరించారు. అమెరికా సామ్రాజ్యవాదులు, ఆఫ్ఘనిస్తాన్‌లో సాగించే యుద్ధానికి శిక్షణనిచ్చిన కిరాయి సైనికులనందించే తామే నియమించుకొన్న అచ్చమైన కాంట్రాక్టర్లలాగానో, లేదా కమీషన్ ఏజెంట్లలాగానో పాకిస్తాన్ పాలకవర్గాలను ఉపయోగించుకుంటూ వున్నారు.

ఆఫ్ఘనిస్తాన్‌ను రష్యా దురాక్రమించిన సందర్భంలో 'టెర్రరిస్టులు'గా పిలవబడిన ప్రస్తుత తాలిబన్లను అమెరికా మరియు ఇతర సామ్రాజ్యవాదులు 'జాతీయ విముక్తి యోధులు'గా పిలిచారనేది ప్రపంచానికంతటికీ తెలిసినదే. ఈ 'యోధుల'కు ఆర్థిక సహాయం, నియామకం, శిక్షణలను అమెరికా, వారి గూఢచార సంస్థ సిఐఏ చేపట్టగా, పాకిస్థాన్ పాలకులు దీనికి పూర్తిగా సహకరించారు. తిరిగి, ఆఫ్ఘనిస్తాన్ నుండి రష్యా సేనల ఉపసంహరణ తర్వాత, తాలిబన్ల ప్రభుత్వం అమెరికా దురాక్రమణ లక్ష్యంగా మారిన తర్వాత, తాలిబన్లు దీనికి వ్యతిరేకంగా పోరాడటంతో, పాకిస్థాన్‌తో సహా అమెరికా దాని మిత్రదేశాలన్నీ తాలిబన్లను 'టెర్రరిస్టు'లనీ 'శత్రువులనీ' పిలుస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌పై అమెరికా దురాక్రమణ యుద్ధానికి కావలసిన మద్దతునూ, సహకారాన్నీ పాకిస్థాన్ పాలకులు కొనసాగిస్తూ వస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదులు, తమ ఈ 16 సం॥ల సుదీర్ఘ దురాక్రమణ యుద్ధంలో పాకిస్థాన్ భూభాగాలనూ, మానవ, పాదార్థిక వనరులనూ తమ స్వంతమైనవన్నట్లుగానే ఉపయోగించుకున్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల విస్తరణ, జోక్యం, పాకిస్థాన్ భూభాగాలను, వనరులను ఉపయోగించుకోవటంపట్ల పాకిస్తాన్ ప్రజలు భారీ నిరసనను, తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. అమెరికా చర్యలను వ్యతిరేకించటానికి బదులుగా, పాకిస్థాన్ పాలకులు క్రూర అణచివేత చర్యలతో ప్రజల నోళ్ళుమూయించారు. టెర్రరిస్టులను, ఒసామా–బిన్–లాడెన్‌ను వేటాడే పేరుతో అమెరికా, పాకిస్థాన్ లోపట పైలెట్‌రహిత విమాన దాడులను, విమానాలనుండి బాంబుదాడులను సాగించింది. ఈ దాడులపట్ల పాకిస్తాన్ పాలకులు అంగీకారం తెల్పటమో, సహించటమో లేదా కుమ్మక్కవటమో జరిగింది. స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతలనే దేశానికుండే హక్కులను గౌరవిస్తామని ప్రకటించుకునే ఏ పాలకులకైనా ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయం.

అయితే అమెరికా, పాకిస్తాన్‌ల నడుమ ఈరోజు ఈ వైరుధ్యమేమిటి? స్వతంత్ర, సార్వభౌమదేశంగా జీవించగలిగే ఆఫ్ఘన్ ప్రజల హక్కును అణచివేయటంలో, అమెరికా సాగించే సైనికదాడి, దురాక్రమణ యుద్ధంలో సాధనంగా తమంతట తాము ఉపయోగపడటమనే దుర్మార్గానికొడిగట్టి తీవ్రమైన తప్పిదానికి పాల్పడ్డామని పాకిస్థాన్ పాలకులు గుర్తించటం వలన ఇటువంటి వైరుధ్యమేమైనా తలెత్తిందా? కానే కాదు. తమ సేవలకు, యజమానులు తగిన గుర్తింపు ఇవ్వకపోవటంపట్ల యజమానులపై పాకిస్తాన్ పాలకులు ఆగ్రహంగా వున్నారు. కాగా, యజమానులైన అమెరికా సామ్రాజ్యవాదులు పాకిస్తాన్ పాలకులను రంగం నుండి తప్పించటంకానీ లేదా

యజమానులకు సేవచేయటంలో పోటీదారులుగా వ్యవహరించేవిధంగా వారితో వైరుధ్యమున్న కొత్త నటులను రంగప్రవేశం చేయించటానికిగానీ చూస్తున్నారు. పాకిస్తాన్ పాలకుల ఈ వైఖరి సామ్రాజ్యవాద బానిస సంకెళ్ళను తెంచు కునేందుకు పాకిస్తాన్ ప్రజలకేమీ తోడ్పడదు. ఇక, అమెరికన్ సామ్రాజ్యవాదులు కోరుకున్న విధంగా తాలిబన్లతో వ్యవహరించటంలో, పాకిస్తాన్ పాలకులు ఇప్పటికీ ఒక ప్రముఖమైన పాత్రను పోషించగలుగు తారని స్పష్టంగా వున్నారు. వెయ్యిన్నొక్క బంధాలతో పాకిస్తాన్ పాలకులు అమెరికాతో కట్టివేయబడి వున్నారని, వాటినుండి వారు స్వేచ్ఛగా బయటకు రాలేరని అమెరికా సామ్రాజ్యవాదులకు తెలుసు. అదే సమయంలో, చైనాతో పాకిస్తాన్ సంబంధాలు పెరగటంపట్ల అమెరికా కలత చెందుతోంది. పాకిస్తాన్ పాలకులతో వ్యవహరించటానికి వీరి మధ్య సంబంధాలు నూతన ఇబ్బందులను కల్పించవచ్చని సంకోచిస్తున్నది.

ఆఫ్ఘనిస్తాన్ ప్రజల స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతల హక్కును భారత ప్రజలు గౌరవిస్తారు. అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా ఆఫ్ఘన్ ప్రజలు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికే వారి మద్దతూ, సంఘీభావం వుంటుంది. కనుక, అమెరికా సామ్రాజ్యవాదులు ఆఫ్ఘన్ ప్రజలపై సాగిస్తున్న అన్యాయ యుద్ధానికి భారత పాలకులు తమ సేవ లందించే ఎటువంటి చర్యనైనా భారత ప్రజలు వ్యతిరేకిస్తారు. అదేవిధంగా పాకిస్తాన్‌పట్ల, పాకిస్తాన్ ప్రజలపట్ల సామ్రాజ్యవాదుల–ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల–పెత్తనంచేసే ఎటువంటి విధానాల నైనా భారత ప్రజలు వ్యతిరేకిస్తారు. సామ్రాజ్యవాదులకు పాకిస్తాన్ లొంగుబాటుకు వ్యతిరేకంగా పాకిస్తాన్ ప్రజలు చేసే ఏ ప్రయత్నాన్నైనా, ఏ పోరాటాన్నైనా భారత ప్రజలు ఆహ్వానించి, మద్దతునిస్తారు. సామ్రాజ్యవాద విధానాలైన జోక్యందారీతనం, విభజించటం, ఆధిపత్యం వహించటం వంటివాటిని వ్యతిరేకించటంతోపాటు శాంతి, సమస్యల శాంతియుత పరిష్కారం, అందరి మంచిని ఆశించే ఉమ్మడి లక్ష్యాల కొరకు ఇరుదేశ ప్రజలు చేతులు కలపటం ఆదర్శంగా వుంటుంది.

ooooo